# కావ్యకన్యక

యం. యస్. మూర్తి

"—శేషయ్యా?

"దేవా! ఇక్కడే వున్నా!"

"ఏమిటోయ్ ఈ కవి పంపించుకున్న మహజరూ?"

"చిత్తం! ఆయన తమ బాబయ్యగారి కాలంనుంచీకూడా మన ఆస్థానంలోనే బ్రతుకుతున్నాడండి—"

"అయితే, ఇప్పుడేమంటాడూ? జీతం హెచ్చు చెయ్యమంటాడా, యుద్ధపు అలవెన్సు ఇయ్యమంటాడా....?"

"లేదు లేదండి! అంతమాట అనగేడా?"

"మరేమిటీ, ఇంత గ్రంథం రాసుకొచ్చాడూ?"

"చిత్తం! ఈ మధ్య ఆయన సృష్టించిన కావ్యకన్యకను—"

"ఏం కన్యకా?"

"కావ్యకన్యకండి! దాన్ని తమకు కృతిసమర్పణ చేద్దామని—"

"నాకే? నాకేనటోయి?"

"చిత్తం! తమకేనండి—తమ జన్మదినోత్సవ సంవత్సరంలో, తమరు నిండు పేరోలగంలో, పూర్ణ చంద్రునివలె

"ఊ!"

"వంధిమాగధులు తమ కీర్తిని స్తుతిస్తూ వుండగా, సురపుంగవులు వేదోక్త మంత్రాక్షతలతో తమ మకుటంపై ఆశీర్వాద కలశాలు బోరున వర్షిస్తూ వుండగా—"

"ఊ! బావుంది!—"

"నృత్యగానాదులతో, మేళతాళాలతో దేవదాసీలు తమ సభను దేవేంద్ర సభగా మారుస్తూండగా—"

"భేష్! మంత్రీ!"

"అటువంటి మహత్తర గడియలలో ఈ పండితుడు తమ కావ్యకన్యకను తెచ్చి ప్రభువువారి కైవశంచేసి, తమ కటాక్షవీక్షణాల్ని పొందడానికి సంకల్పించుకున్నాడు—"

"చాలా మంచివాడిలా కన్పిస్తాడు. మనమీద ఎంత అభిమానం! అయితే చూడు, శేషయ్యా, మనలోమాట — మన్నం దాన్ని స్వీకరించవచ్చునంటావా."

"ఎవరినండీ"

"అదే—అ....కవ్యకను."

"భేషుగ్గా స్వీకరించవచ్చునండి—తప్పే

పండితుడు. అది మకరందాన్ని పోలిన కావ్యసుందరి—"

"విందు సభలోనే తెచ్చి యిస్తాడా?"

"అవునండి — దానికేం? విందు సభలో ఇస్తేనే తమ ఘనత, దాని ఘనత, ఆ పండితుడి ఘనతాను."

"శేషయ్యా?"

"ఏం ప్రభూ? అలా అయిపోతున్నారేం?"

"ఈ కావ్యకన్యకను—ఈ పండితుడు మనకి దఖలు చేస్తానన్న—?"

"ఊ! ఏమిటండి దాని సంగతి"

"మా అమ్మతో చెప్పవద్దుటోయ్?"

"దానికేమండీ? చెబుదాం—"

"ఆవిడకు తెలిస్తే ఏమైనా అంటుందేమో?"

"మాతృశ్రీగారా? తమర్ని? ఏమైనా అనడమా? తమరు ఏమంత మహాపాపం చేస్తున్నారని? విశేషించి, ఈ వార్త విని ఆవిడ ఎంతో సంబరపడుతుంది—"

"నాకేదో దిగులుగా వుందోయ్?"

"ఏమీ దిగులు చెందకండి—దిగులు చెందవలసినదేమీ లేదు ఇందులో—"

"శేషయ్యా?"

"ప్రభూ?"

"ఈ పండితుడు తనలాంటి కావ్యకన్యకను నాకు తెచ్చి ఇవ్వడంలో వుద్దేశమేమిటి?"

"చిత్తం! తమరికిగాక ఇంకెవరికిస్తారండి? తమరే సర్వవిధాలా దాన్ని స్వీకరించడానికి అర్హులు—"

"మా బాబయ్యగారు బ్రతికివుండే రోజుల్లో ఆయన ఇలా....ఏమైనా స్వీకరించాడా?"

"లక్షలాది! ఇందులో తప్పేముందండీ?

"సరే అయితే! దాని పేరేమిటి?"

"దేని పేరండీ?"

"అదేనయ్యా, ఈ పండితుడు మనకి ఇవ్వబోయే—"

"చంద్రకళండి—"

"పేరు చక్కగా వుంది!"

"పేరుకు తగిన ఆకర్షణ కూడా వుందండి దానిలో."

"అయితే....శేషయ్యా"

"చిత్తం! ప్రభూ!"

"చూడూ, దాని వయస్సెంతా....?"

".... ... . "